టాప్ న్యూస్


## సిరీస్ టీమిండియాదే..



- వైజాగ్ వన్డేలో సునాయాస విజయం
- రోహిత్ శర్మ ప్రపంచ రికార్డు

02

## సీఎం రేవంత్‌కు మమతా బెనర్జీ లేఖ



- గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావాలని ఆకాంక్ష

02

## శశిరేఖ.. ఓ మాట



- అదిరిపోయిన మెగాస్టార్.. నయనతార ప్రోమో
- రేపు సాంగ్

02



కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

ANN తెలుగు

Follow: @mahaadaily

REGISTERED NUMBER: APTEL/2014/58382

07-12-2025

# మహా పత్రిక

తిరుపతి, హైదరాబాద్

సంపుటి- 22 సంచిక- 348 పేజీలు-04 వెల-రూ.6

PUBLISHED FROM TIRUPATI | HYDERABAD ఆదివారం WWW.EPAPER.MAHAADAILY.COM

## తెలంగాణ రైజింగ్

తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఇపుడు భారతదేశాన్ని ఆకర్షిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్ రైజింగ్ తెలంగాణ 2047ఆవిష్కరణ నవనగరం భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనుంది. హైదరాబాద్.. దేశంలోనే అత్యంత సురక్షిత పెట్టుబడుల నగరం మరో భారీ సమ్మిట్ కు సిద్ధమైంది. లక్షకోట్లకు పైగా పెట్టుబడులు.. వందకు పైగా కంపెనీలు హైదరాబాద్ కు తరలివస్తున్నాయి. "దావోస్" శైలిలో హైదరాబాదును పెట్టుబడిదారుల గమ్యస్థానంగా నిలబెట్టాలని తెలంగాణ ప్రభుత్వం ప్లాన్ చేస్తున్న తీరు దేశవ్యాప్తంగా కొత్త చర్చకు తెరలేపింది. రేవంత్ విజన్ పారిశ్రామిక దిగ్గజాలను ఆకట్టుకుంటుందా? ఇది కేవలం భారీ ఈవెంట్ మాత్రమేనా, లేక రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మారుస్తున్న దీర్ఘకాల వ్యూహమా? అన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సిఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ ఎనాలసిస్

ఎడిటోరియల్ పేజీ 4లో



## ఇండిగో సంక్షోభంపై ప్రధాని సీరియస్

# రామ్మోహన్ ఔట్!



### విమానయానశాఖ తీరుపై భగ్గుమన్న దేశం

- రామ్మోహన్ నాయుడుపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు
- బస్టాండ్లకంటే అధ్వాన్నంగా ఎయిర్ పోర్ట్‌లు
- రామ్మోహన్ తెచ్చిన అప్రతిష్టపై చంద్రబాబు ఆగ్రహం
- ఐదురోజులైనా.. కొలిక్కిరాని సమస్య.. రంగంలోకి ప్రధాని
- విమానయానశాఖ తీరుపై సీజే ఆగ్రహం
- హైదరాబాద్‌కు రావాల్సిన 26 ఇండిగో విమానాలు రద్దు
- హైదరాబాద్ నుంచి వెళ్లాల్సిన 43 ఇండిగో విమానాలు రద్దు
- దేశవ్యాప్తంగా వందలాది విమానాలు రద్దు



ఢిల్లీ-మహా: దేశవ్యాప్తంగా ఇండిగో సంక్షోభంతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్న వేళ.. ప్రధాని నరేంద్ర మోదీ నేరుగా రంగంలోకి దిగారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడి పనితీరుపై మోదీ అసంతృప్తి వ్యక్తం చేశారు. విమానయాన శాఖ అధికారులతో నేరుగా మోదీ సమీక్షించారు. ఇండిగో సంక్షోభంపై మోదీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షకు కేంద్రమంత్రి రామ్మోహన్‌ను పీఎంవో పక్కనపెట్టింది. దేశంలో అతి పెద్ద విమానయాన సంస్థ ఇండిగో విమాన సేవలకు వరుసగా ఐదోరోజూ అంతరాయం కలగగా, శనివారం వందలాది ఇండిగో విమానాలు రద్దైనట్లు ఆ సంస్థ ప్రకటించింది. మరోవైపు ఇండిగో సంక్షోభం సుప్రీంకోర్టుకు చేరింది. పరిస్థితి ఇంత దారుణంగా మారడానికి పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు కారణమమని, ఆయన ఘోరంగా విఫలమయ్యారంటూ ప్రయాణికులు దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వివరాలు 2లో



## ట్రబుల్ షూటర్ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు

గ్లోబల్ సమ్మిట్‌తో మార్మోగుతున్న పేరు

కరీంనగర్ గర్వ పతాక

వివరాలు 4లో



## నభూతో నభవిష్యత్

### అత్యంత ఘనంగా సమ్మిట్ నిర్వహణ

- గ్లోబల్ సమ్మిట్ ఎజెండా ఖరారు
- సమ్మిట్‌లో నిర్వహించనున్న 27 ప్రత్యేక సెషన్లు
- అడుగడుగునా నిఘా, భారీ స్క్రీన్లు, పార్కింగ్ కు ప్రత్యేక ఏర్పాట్లు
- అతిథిలకు ఏ మాత్రం అసౌకర్యం కలుగకుండా ఇంటర్నెట్ సేవలు
- నిరంతర విద్యుత్ కోసం అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ
- డిప్యూటీ సీఎం భట్టితో చిరంజీవి, నాగార్జున భేటీ.. సినిమా పరిశ్రమ రావాలని ఆహ్వానం

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ అజెండాను ప్రభుత్వం ఖరారు చేసింది. రెండు రోజుల పాటు ఫ్యూచర్ సిటీ వేదికగా జరిగే ఈ అంతర్జాతీయ ఆర్థిక సదస్సులో వివిధ అంశాలను మొత్తం 27 సెషన్లు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సదస్సులో డిసెంబర్ 9 న సాయంత్రం తెలంగాణ రైజింగ్ గ్లోబల్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించనున్నారు.

మిగతా 2లో


## కేటీఆర్ ఒక్కడు చాలు.. కేసీఆర్‌ను

# నాశనం చేయడానికి

### పదేళ్ల దోపిడీ ఇంకా చాల్లేదా కేసీఆర్?

మంచి రోజులొస్తాయంటున్నావ్.. దేవరకొండ సభలో సీఎం రేవంత్ ఫైర్

ఎవరు అడ్డుపడ్డా ఎస్ఎల్ బీసీ పూర్తి చేసి తీరుతాం



**హైదరాబాద్, మహా:** ప్రజాపాలన రెండేళ్లు పూర్తి సందర్భంగా ఉత్సవాలు చేసుకుంటున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజా ప్రభుత్వానికి అండగా నిలిచిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలో పర్యటించారు. నియోజకవర్గంలో రూ.23 కోట్ల విలువైన పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా దేవరకొండ నియోజకవర్గంలో రూ.23 కోట్ల విలువైన పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. అనంతరం బహిరంగ రంగ సభలో మాట్లాడారు. రెండేళ్ల క్రితం ఓటును ఆయుధంగా మార్చి గడీల పాలనను కూల్చారని రేవంత్ అన్నారు.


మిగతా 2లో



## తొలిసారి ఇండియన్ సూపర్ క్రాస్ రేసింగ్

### సీఎం రేవంత్ తో కలిసి వీక్షించిన సల్మాన్ ఖాన్ .. వావ్ అనిపించేలా విన్యాసాలు

**హైదరాబాద్, మహా :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బాలీవుడ్ నటుడు, ఇండియన్ మెగాస్టార్ సల్మాన్ ఖాన్ ఒకే వేదికపై మెరిశారు. శనివారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి అథ్లెటిక్ స్టేడియంలో ఇండియన్ సూపర్ క్రాస్ రేసింగ్ లీగ్ సీజన్2 ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి శ్రీధర్ బాబు, బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్, సల్మాన్ ఖాన్ కలిసిన ఫోటోలు, మాట్లాడుతున్న ఫొటోలు వైరల్ గా మారాయి. సూపర్ క్రాస్ రేసింగ్ తెలంగాణలో జరగడం ఇదే మొదటిసారి కావడం విశేషం. రెండు రోజుల పాటు ఈ రేసింగ్ పోటీలు జరుగుతున్నాయి. ఐఎస్ఆర్ఎల్ సహ వ్యవస్థాపకుడు ఇషాన్ లోఖండే రేసింగ్ పోటీలు నిర్వహిస్తున్నారు. పోటీల్లో మొత్తం ఆరు జట్లకు సంబంధించిన 48 మంది రైడర్లు పాల్గొంటారని ఆయన తెలిపారు.





## రేవంత్ రెడ్డి అనే నేను..

సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన అపురూప ఘట్టానికి రెండేళ్ళు

# జీహెచ్ఎంసీ@306

### డీలిమిటేషన్ తో వార్డులు పెంచే అవకాశం.. ఈ వారంలోనే డీలిమిటేషన్ డ్రాఫ్ట్

GHMC

**హైదరాబాద్ సిటీ, మహా :** గ్రేటర్ హైదరాబాద్ సిటీ తాజా విలీనాలతో విస్తీర్ణంలో దేశంలోనే అతిపెద్ద సిటీగా ఉండగా, వార్డుల డీలిమిటేషన్ తో ఈ సంఖ్య 306 కు చేరనున్నట్లు సమాచారం. ఇప్పటికే దీనిపై కసరత్తు పూర్తికాగా, సోమవారం లేదా.. గ్లోబల్ సమ్మిట్ ముగిసిన అనంతరం డీలిమిటేషన్ ముసాయిదా నోటిఫికేషన్‌ను జారీ చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ప్రతి 40 వేల మంది జనాభాతో ఒక వార్డు ఏర్పాటుచేయనున్నారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీలో 150 వార్డులు ఉండగా, డీలిమిటేషన్ ఈ ప్రాంతాల్లో కూడా భారీగా వార్డులు పెరగనున్నట్లు తెలుస్తోంది. కొత్తగా ఏర్పడే డివిజన్లకు ఆయా ప్రాంతాల్లోని చారిత్రక ప్రాంతాలు, పేరుగాంచిన ల్యాండ్‌మార్క్‌లతో పేర్లను అధికారులు ఖరారు చేస్తున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయా ప్రాంతాల్లోని ప్రపంచ ప్రఖ్యాత పేరున్న కంపెనీల పేర్లు రోడ్లకు పెడతామని చెప్పారు. కొన్ని డివిజన్లకు కూడా అలా పేర్లు పెట్టే సూచనలు కనబడుతున్నాయి. డీలిమిటేషన్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ జారీ అయిన వెంటనే, జీహెచ్ఎంసీ మున్సిపల్ యాక్ట్ నిబంధనల ప్రకారం కేవలం వారం రోజుల్లోనే అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం చేసి, తుది నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. పాత జీహెచ్ఎంసీ పరిధిలో మరో 50 నుండి 100 వరకు డివిజన్లు రానుండగా, విలీన ప్రాంతాల్లో 50 నుండి 75 డివిజన్లు వచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.



## శశిరేఖ.. ఓ మాట

**అదిరిపోయిన మెగాస్టార్ నయనతార ప్రోమో .. రేపు సాంగ్**

**మహా:** మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మన శంకర వరప్రసాద్‌గారు' నుంచి మరో క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. ఈ సినిమా నుంచి రెండో పాటను విడుదల చేసేందుకు చిత్ర బృందం తేదీని ఖరారు చేసింది. 'శశిరేఖ'.. ఓ మాట పాట ఇంట్రోనే మీసాలపిల్లను మించి వావ్ అనేలా ఉంది. ఈ పేరుతో రానున్న పాటను ఈ నెల 8న విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా పాటకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన ప్రోమోను కూడా అభిమానులతో పంచుకుంది. ఇందులో నయనతార, చిరంజీవి ఫ్రెష్ లుక్ తో కనిపిస్తున్నారు.

## సీఎం రేవంత్‌కు మమతా బెనర్జీ లేఖ

**గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావాలని ఆకాంక్ష**

**హైదరాబాద్,మహా:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025'కు సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానంపై మమతా బెనర్జీ సానుకూలంగా స్పందించారు. ఇంతటి భారీ కార్యక్రమానికి తనను ఆహ్వానించినందుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అయితే, సదస్సు జరిగే తేదీలలోనే తాను పశ్చిమ బెంగాల్‌లోని పలు జిల్లాల్లో పర్యటించాల్సి ఉందని, ఇదివరకే ఖరారైన ఆ షెడ్యూల్ కారణంగా హైదరాబాద్ రాలేకపోతున్నానని వివరించారు. తాను హాజరుకాలేనని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెలిపారు. ఈ మేరకు ఆమె తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఈ సదస్సు లక్ష్యం నెరవేరాలని ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి సదస్సులో జరిగే చర్చలు ఫలవంతం కావాలని, తెలంగాణకు మంచి ఫలితాలు రావాలని కోరుకుంటూ మమతా బెనర్జీ శుభాకాంక్షలు తెలియజేశారు.

## శ్రీగిరిపై శివనామ స్మరణ..

**ఫిబ్రవరి 8 నుంచి శ్రీశైల మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు**

**శ్రీశైలం,మహా:** ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మల్లన్న ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముహూర్తం ఖరారైంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 8వ తేదీ నుంచి 18వ తేదీ వరకు మొత్తం 11 రోజుల పాటు ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సంబంధిత విభాగాల అధికారులతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై కీలక సమీక్ష నిర్వహించారు. దేశ నలుమూలల నుంచి లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన మహాశివరాత్రి పర్వదినం ఫిబ్రవరి 15వ తేదీన జరగనుంది. ఆ రోజున రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. శివరాత్రి రోజు రాత్రి లింగోద్భవ కాలంలో స్వామివారికి అత్యంత విశేషమైన పాగా అలంకరణ సేవను, అనంతరం స్వామి అమ్మవార్ల బ్రహ్మోత్సవ కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. అలాగే మహాశివరాత్రి మరుసటి రోజు, అంటే ఫిబ్రవరి 16వ తేదీన భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల రథోత్సవం జరగనుంది. పదకొండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో ఆలయ సాంప్రదాయాల ప్రకారం వాహన సేవలు, విశేష పూజలు నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తూ, ఈ ఉత్సవాలను విజయవంతం చేయడమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేస్తోందని ఈవో శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## బీజేపీ సర్పంచ్ ను గెలిపిస్తే రూ. 25 లక్షలు

**ఎంపీ రఘునందన్ రావు బంపర్ ఆఫర్**

**సిద్దిపేట, మహా :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ బలపరచిన సర్పంచ్ అభ్యర్థిని గెలిపిస్తే గ్రామ అభివృద్ధి కోసం ఎంపీ నిధులు నుంచి లేదా సీఎస్ ఆర్ కింద రూ.25 లక్షల నిధులు ఇప్పిస్తా అని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ప్రకటించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ.. అంబేద్కర్ రాజ్యాంగాన్ని పరిహాసం చేసే విధంగా సర్పంచ్ ఏకగ్రీవం కోసం వేలం పాటలు నిర్వహించడం దురదృష్టకరం అన్నారు. ఏకగ్రీవాలు అంబేద్కర్ స్ఫూర్తికి వ్యతిరేకం అన్నారు. గ్రామాల అభ్యున్నతే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రామ పంచాయతీలకు నేరుగా నిధులు చేరేలా ప్రధాని నరేంద్ర మోడీ నిర్ణయం తీసుకున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు పీఎఫ్ డబ్బులు చెల్లించని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. రాష్ట్రానికి సంబంధించి రూ. 3500 కోట్లు 15 ఆర్థిక సంఘం నిధులు ఆగిపోయే పరిస్థితి నెలకొన్న వేళ తప్పని పరిస్థితుల్లో సీఎం రేవంత్ రెడ్డి గ్రామ పంచాయతీ ఎన్నికలకు తెర లేపారన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేస్తే నయా పైస లాభం ఉండదన్నారు. సిద్దిపేట జిల్లా పరిధిలోని ఒక బీఆర్ఎస్ ఎమ్మెల్యే బయటకు రాడు.. మరో ఎమ్మెల్యే వ్యాపారం చేసుకుంటాడు.. మరో ఎమ్మెల్యే కు పేపర్ల ఫోటో కనబడకుంటే నిద్ర పట్టదని ఎద్దేవా చేశారు. ఇంచార్జి మంత్రి ఎప్పుడు వస్తారో ఎవరికీ తెలియని పరిస్థితి ఉందన్నారు. తనకు వచ్చిన ఎంపీ నిధుల్లో 65 శాతం నిధులు సిద్దిపేట జిల్లాలో ఖర్చు చేసినట్లు రఘునందన్ రావు తెలిపారు.

### ఇండిగో సంక్షోభంపై ప్రధాని సీరియస్

# రామ్మోహన్ ఔట్

**(ఢిల్లీ-మహా)**

దేశవ్యాప్తంగా ఇండిగో సంక్షోభంతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్న వేళ.. ప్రధాని నరేంద్ర మోదీ నేరుగా రంగంలోకి దిగారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడి పనితీరుపై మోదీ అసంతృప్తి వ్యక్తం చేశారు. విమానయాన శాఖ అధికారులతో నేరుగా మోదీ సమీక్షించారు. ఇండిగో సంక్షోభంపై మోదీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షకు కేంద్రమంత్రి రామ్మోహన్‌ను పీఎంవో పక్కనపెట్టింది. దేశంలో అతి పెద్ద విమానయాన సంస్థ ఇండిగో విమాన సేవలకు వరుసగా ఐదోరోజూ అంతరాయం కలగగా, శనివారం వందలాది ఇండిగో విమానాలు రద్దైనట్లు ఆ సంస్థ ప్రకటించింది. మరోవైపు ఇండిగో సంక్షోభం సుప్రీంకోర్టుకు చేరింది. పరిస్థితి ఇంత దారుణంగా మారడానికి పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు కారణమమని, ఆయన ఘోరంగా విఫలమయ్యారంటూ ప్రయాణికులు దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి చేతకానితనంతో దేశ ఏవియేషన్ రంగంలో పెను సంక్షోభం నెలకొందని నెటిజన్లు మండిపడుతున్నారు. ఇండిగో సంక్షోభాన్ని చివరి వరకు రామ్మోహన్ పట్టించుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల గుజరాత్ లో ఘోరప్రమాదం, ఇపుడు తాజాగా నివారించగలిగే సమస్యను నిర్లక్ష్యం కారణంగా దేశాన్ని అతలాకుతలం చేయడంపై మోదీ తీవ్ర ఆగ్రహంగా ఉన్నట్లు తెలిసింది. ఏపీ ముఖ్యమంత్రి, ఎన్ డీఏలో కీలక భాగస్వామి చంద్రబాబు కూడా ఈ పరిణామాలపై ఆగ్రహంగా ఉన్నట్లు తెలిసింది. తెలుగుదేశంపార్టీకి దేశంలో ఓ ప్రతిష్ట ఉందని, బారీ శాఖను నిర్వహిస్తూ.. ఇంత పెద్ద ప్రమాదాన్ని గుర్తించకపోవడంపై ఆగ్రహంగా ఉంది. ఈ నేపథ్యంలో రామ్మోహన్ నాయుడును విమానయాన శాఖ నుండి తప్పించాలని ప్రధాని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. త్వరలో కేబినెట్ నుండి తప్పించడం లేదా శాఖ నుండి తప్పించడం ఖాయమని ఢిల్లీ బిజెపి వర్గాల్లో చర్చ ఉంది. దేశంలోని అన్ని వర్గాలు ఇండిగో సంక్షోభంలో రామ్మోహన్ నాయుడునే దోషిగా చూస్తున్నాయి. రామ్మోహన్ నాయుడు కారణంగా దేశవ్యాప్తంగా టీడీపీ ఇమేజ్ కూడా డ్యామేజ్ అవుతున్న పరిస్థితి నెలకొంది. ఇండిగో సంక్షోభం ముగియగానే.. రామ్మోహన్ నాయుడుపై నిర్ణయం తీసుకుంటారని, నెగిటివ్ సంకేతాలు వస్తాయనుకుంటే త్వరలో జరిగే విస్తరణలో ఏపీ నుండి మరొకరిని తీసుకుని.. పెమ్మసానికి ప్రమోషన్ ఇస్తారని, రామ్మోహన్ నాయుడుపై చర్యలు ఉంటాయని చెబుతున్నారు. కేంద్రప్రభుత్వ వర్గాలు, బీజేపీ కోర్ టీమ్ రామ్మోహన్ నాయుడు తీరుపై తీవ్ర ఆగ్రహంగా ఉంది. రామ్మోహన్ నాయుడు నిర్లక్ష్యంగా కారణంగా దేశంలోని ఎయిర్ పోర్ట్ లు బస్టాండ్ ల కంటే అధ్వాన్నంగా మారాయి.

**దేశం ముందు పరువు తీస్తున్నారా?**

గతంలో గుజరాత్ ప్రమాద సమయంలో దేశాన్ని ఉలికిపాటుకు గురిచేస్తే రామ్మోహన్ నాయుడు సందర్భనకు వెళ్ళి రీల్స్ చేసుకున్నారన్న విమర్శలు వచ్చాయి. దీనిపై నేషనల్ మీడియాతో పాటు నెటిజన్లు తీవ్రంగా విమర్శించారు. ఇపుడు కూడా.. సమస్య ముందుగా తెలిసినా ప్రమాదాన్ని ఊహించకుండా జాగ్రత్తలు తీసుకోకుండా దేశం ముందు నవ్వులపాలు చేశారని, వేల విమాన ట్రిప్పుల రద్దు.. ఎంతోమంది ఆశలు ఛిన్నాభిన్నం అయ్యాయని మండిపడుతున్నాయి. పీఆర్, రీల్స్ కు పెట్టిన సమయం.. శాఖపై పెట్టలేదని, ఇంత భారీశాఖను నిర్వహించలేకపోతున్నారని.. సీనియర్ కు సమర్థులకు శాఖ అప్పగించాలని కేంద్ర పెద్దలు ప్రధానికి సూచించినట్లు తెలిసింది. మరోవైపు ఈ వ్యవహారంతో ఏ మాత్రం సంబంధం లేని ఏపీ మంత్రి లోకేష్ ను అనవసరంగా వివాదంలోకి తేవడంపైనా పార్టీ నేతలు ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది.

**ఇండిగోపై సీరియస్**

ఇండిగో సంస్థపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. విమానాల ఆకస్మిక రద్దు, ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంపై సీరియస్ అయ్యింది. ప్రయాణికుల టికెట్ రద్దు రీఫండ్‌ను ఆలస్యం చెయవద్దని.. ఆదివారం రాత్రి 8లోపు డబ్బులు తిరిగివ్వాలని తీవ్రంగా హెచ్చరించింది. మరోవైపు, ఉద్దేశపూర్వకంగానే విమానాల సంక్షోభం సృష్టించి దానికి డీజీసీఏ నిబంధనలు సాకుగా చూపుతుందని మండిపడింది.

## ఇండిగో రద్దుల కలకలం

దేశవ్యాప్తంగా ఇండిగో విమాన సర్వీసుల రద్దు ప్రయాణికులకు చుక్కలు చూపిస్తోంది. సాంకేతిక కారణాల సాకుతో ఒక్కసారిగా విమానాలు రద్దవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా భోపాల్ విమానాశ్రయంలో పరిస్థితి దారుణంగా మారింది. గంటల తరబడి ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌లో చిక్కుకుపోవడంతో వారి షెడ్యూల్ మొత్తం తలకిందులైంది. ఈ గందరగోళం మధ్య గుండెలు పిండేసే ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. భోపాల్ విమానాశ్రయంలో ఒక వృద్ధ దంపతులు తమ కూతురి పెళ్లికి వెళ్లలేక తీవ్ర ఆవేదనకు గురయ్యారు. వారు ముంబై మీదుగా తిరువనంతపురం వెళ్లాల్సి ఉండగా, చివరి నిమిషంలో విమానం రద్దవడంతో వారికి ఏం చేయాలో పాలుపోలేదు. కుమార్తె వివాహ క్రతువు అప్పటికే మొదలవగా, ప్రత్యామ్నాయ మార్గాలు లేక వారు విమానాశ్రయంలోనే కన్నీరుమున్నీరయ్యారు. రోడ్డు మార్గంలో వెళ్లాలంటే దాదాపు 36 గంటల సమయం పడుతుండటం, రైలులో వెళ్లే అవకాశం లేకపోవడంతో ఆ తల్లిదండ్రులు నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు. విమానయాన సిబ్బందిని ఎంత బ్రతిమాలినా ఫలితం లేకపోవడంతో వారు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. మరోవైపు ఎయిర్‌లైన్స్ సమాచార వ్యవస్థలో లోపాలు ప్రయాణికులను మరింత గందరగోళానికి గురిచేస్తున్నాయి. దీనికి ఉదాహరణగా ఒక విచిత్రమైన ఘటన చోటుచేసుకుంది. ఒక ప్రయాణికుడికి మొదట విమానం రద్దయినట్లు మెసేజ్ రావడంతో, అతను కంగారుగా రోడ్డు మార్గంలో ఇండోర్‌కు బయలుదేరాడు. కానీ ఇండోర్ చేరుకోగానే విమానం నడుస్తోందని మరో సందేశం వచ్చింది. దీంతో అతను హుటాహుటిన మళ్ళీ భోపాల్‌కు తిరిగి వచ్చాడు. తీరా విమానాశ్రయానికి చేరుకున్నాక, విమానం మళ్ళీ రద్దయినట్లు అధికారులు తెలిపారు. ఎయిర్‌లైన్స్ పంపిన పరస్పర విరుద్ధమైన సందేశాల వల్ల తన సమయం, ధనం వృథా అయ్యాయని, ఇది తన జీవితంలోనే అత్యంత చెత్త ప్రయాణ అనుభవమని ఆ ప్రయాణికుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. విమానాల రద్దుతో ఆర్థికంగానూ ప్రయాణికులు భారీగా నష్టపోతున్నారు. ఒక ఎన్ఆర్ఐ జంట ముంబై వెళ్లేందుకు ప్రత్యామ్నాయం లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చివరి నిమిషంలో ఇతర విమానాల్లో టికెట్లు దొరక్కపోవడం, ఉన్నవాటి ధరలు ఆకాశాన్ని తాకడంతో వారు ఏకంగా లక్ష రూపాయలు వెచ్చించి టికెట్లు కొనుగోలు చేయాల్సి వచ్చింది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఎయిర్‌లైన్స్ యాజమాన్యం ప్రయాణికులకు సరైన ప్రత్యామ్నాయాలు చూపించకపోవడం, కనీసం స్పష్టమైన సమాచారం ఇవ్వకపోవడం శోచనీయమని వారు వాపోయారు. మొత్తంగా ఇండిగో విమానాల రద్దు పర్వం ప్రయాణికుల సహనానికి పరీక్ష పెడుతోంది. శుభకార్యాలు, అత్యవసర పనులు, వ్యాపార లావాదేవీల కోసం వెళ్లాల్సిన వారు విమానాశ్రయాల్లోనే పడిగాపులు కాస్తున్నారు. ఎయిర్‌లైన్ కౌంటర్ల వద్ద ప్రయాణికులు సిబ్బందిని నిలదీస్తున్నా, వారి నుంచి సరైన సమాధానం రావడం లేదు. సాంకేతిక కారణాల వల్ల విమానాలు రద్దయినప్పుడు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలోనూ, సమాచారం ఇవ్వడంలోనూ సంస్థ విఫలమవుతోందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా విమానయాన సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రయాణికుల కష్టాలను తీర్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



### కేటీఆర్ ఒక్కడు చాలు.. కేసీఆర్‌ను

## నాశనం చేయడానికి

**(మొదటిపేజీ తరువాయి)**

పోరాటాల పౌరుషం ఉన్న గడ్డ నల్గొండ జిల్లా అని, నిజాం నిరంకుశ పాలనను ఎదురించిన జిల్లా నల్గొండ అని కొనియాడారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు పేదలకు ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని, ఉన్న రేషన్‌కార్డుల్లో పేర్లు చేర్చుకునేందుకు కూడా పదేళ్లపాటు అవకాశం ఉండలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్త రేషన్‌కార్డులు ఇచ్చిందని గుర్తు చేశారు. రేషన్‌కార్డులపై దొడ్డుబియ్యం రద్దు చేసి సన్నబియ్యం ఇస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో 3.10 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, పేదల ఆకలి తీరినప్పుడే నిజమైన ఇందిరమ్మ రాజ్యం అని విశ్వసించామని పేర్కొన్నారు. కేటీఆర్ ఒక్కడు చాలు కేసీఆర్‌ను నాశనం చేయడానికని ఎద్దేవా చేశారు. 'మంచిరోజులు వస్తాయని కేసీఆర్ అంటున్నారు. పదేళ్ల దోపిడీ ఇంకా చాల్లేదా కేసీఆర్?. ఆయన మళ్లీ అధికారంలోకి వస్తే మనల్ని ముంచే రోజులొస్తాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బండకేసి కొట్టింది గుర్తులేదా..? అయినా.. మీ కుమారుడే మీకు పెద్ద గుదిబండ. కేటీఆర్ ఉన్నంతకాలం బీఆర్ఎస్‌ను ప్రజలు బండకేసి కొడుతూనే ఉంటారు. కేసీఆర్ ఓడిపోయాకే ప్రజలకు మంచి జరిగింది. గతంలో మంత్రులు, ఎమ్మెల్యేలనూ ఆయన కలవలేదు. ఫామ్‌హౌస్, ప్రగతి భవన్‌కు ఎవరినీ రానివ్వలేదు. ఇప్పుడు సర్పంచ్‌లు, వార్డు మెంబర్లనూ కలుస్తున్నారు. యువతకు 60 వేల ఉద్యోగాలు ఇచ్చాం. భవిష్యత్‌లో మరో 40 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తాం. ఎస్ఎల్‌బీసీను కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోలేదు, నిర్లక్ష్యం చేశారు. ఎస్ఎల్‌బీసీ ఆగిందని మామ, అల్లుడు డ్యాన్సులు చేస్తున్నారు. ఎవరు అడ్డుపడ్డా ఎస్ఎల్‌బీసీను పూర్తిచేసి తీరుతాం' అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

## సిరీస్ టీమిండియాదే..

**వైజాగ్ వన్డేలో సునాయాస విజయం.. రోహిత్ శర్మ ప్రపంచ రికార్డు**



**విశాఖ, మహా :** సౌతాఫ్రికాతో వైజాగ్ వేదికగా జరిగిన మూడో వన్డేలో టీమిండియా సునాయాసంగా గెలుపొందింది. 271 పరుగుల విజయ లక్ష్యంతో ఛేదనకు దిగిన భారత్.. కేవలం ఒక వికెట్ కోల్పోయి 39.5 ఓవర్లలోనే ఆటను ముగించింది. యశస్వి జైస్వాల్ (116) అజేయ సెంచరీతో చెలరేగాడు. వన్డేల్లో యశస్వికి ఇది తొలి శతకం. కేశవ్ మహరాజ్ బౌలింగ్‌లో రోహిత్ శర్మ(75) తొలి వికెట్‌గా వెనుదిరిగిన తర్వాత క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లి(65) ఆది నుంచి దూకుడుగా ఆడుతూ నాటౌట్‌గా నిలిచాడు. ఈ మూడు వన్డేల సిరీస్‌లో టీమిండియా 21 తేడాతో సిరీస్‌ను సొంతం చేసుకుంది.

**రోహిత్ రికార్డు**

హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 20,000 పరుగుల మార్కును అధిగమించాడు. ఈ ఘనత సాధించిన ప్రపంచంలోనే 14వ ఆటగాడిగా.. భారత నాలుగో క్రికెటర్‌గా రోహిత్ శర్మ రికార్డు సృష్టించాడు. ఈ జాబితాలో క్రికెట్ దిగ్గజాలు సచిన్ టెండూల్కర్(34,357 పరుగులు), విరాట్ కోహ్లి(27,910 పరుగులు), రాహుల్ ద్రవిడ్(24,064 పరుగులు) తొలి మూడు స్థానాల్లో ఉన్నారు. మరోవైపు హిట్‌మ్యాన్‌కు విశాఖలో ఇది మూడో హాఫ్ సెంచరీ కావడం విశేషం. రోహిత్ తన కెరీర్‌లో ఇప్పటివరకు 50 సెంచరీలు, 110 హాఫ్ సెంచరీలు పూర్తి చేశాడు. భారత్ తరపున 50 అంతర్జాతీయ సెంచరీలు చేసిన మూడో ఆటగాడిగా రోహిత్ నిలిచాడు. అతడికి ముందు సచిన్(100), విరాట్ (83) ఉన్నారు. వన్డేల్లో ఇండియాలో రోహిత్.. 5వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు.

# నభూతో నభవిష్యత్

**(మొదటిపేజీ తరువాయి)**

2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల వ్యవస్థగా తీర్చిదిద్దడానికి రోడ్ మ్యాప్‌ను ప్రభుత్వం ప్రకటించనుంది. ఈ సమ్మిట్‌కు దేశ విదేశాల నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల నిపుణులు, విద్యావేత్తలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు తరలిరానున్నారు. రాష్ట్ర భవిష్యత్తును ఆవిష్కరించే దిశగా జరిగే ఈ గ్లోబల్ సమ్మిట్‌లో రెండు రోజులపాటు మొత్తం 27 ప్రత్యేక ప్యానెల్ చర్చలు జరుగుతాయి. ఎనర్జీ, గ్రీన్ మొబిలిటీ, ఐటీ-సెమీకండక్టర్లు, హెల్త్, ఎడ్యుకేషన్, టూరిజం, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వ్యవసాయం, పరిశ్రమలు, మహిళా వ్యాపారవేత్తల ప్రోత్సాహం, గిగ్ ఎకానమీ, సామాజిక సంక్షేమం, స్టార్టప్‌లు వంటి విభిన్న రంగాలపై చర్చలు ఉంటాయి. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్, వరల్డ్ బ్యాంక్, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, యూనిసెఫ్ ప్రతినిధులతో పాటు టీఈఆర్ఐ, బీసీజీ, మైక్రాన్ ఇండియా, హిటాచి ఎనర్జీ, ఓ2 పవర్, గ్రీన్కో అపోలో హాస్పిటల్స్, ఐఐటీ హైదరాబాద్, ఎన్ఏఎస్ఎస్‌సీఓఎం, సాఫ్రాన్, డీఆర్‌డీఓ, స్కైరూట్, ధృవ స్పేస్, అమూల్, లారస్ ల్యాబ్స్, జీఎంఆర్, టాటా రియాల్టీ, కోటక్ బ్యాంక్, గోల్డ్‌మ్యాన్ సాక్స్, బ్లాక్‌స్టోన్, డెలాయిట్, క్యాపిటల్‌ల్యాండ్, స్విగ్గి, ఏడబ్ల్యూఎస్, రెడ్ హెల్త్, పీవీఆర్ ఇనోక్స్, సిఖ్యా ఎంటర్‌టైన్‌మెంట్, తాజ్ హోటల్స్, వంటి ప్రముఖ సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు. పీవీ సింధు, అనిల్ కుంబ్లే, పుల్లెల గోపీచంద్, గగన్ నారంగ్, జ్వాలా గుత్తా వంటి క్రీడా ప్రముఖులు 'ఒలింపిక్ గోల్డ్ క్విస్ట్' సెషన్‌లో పాల్గొంటారు. రాజమౌళి, రితేష్ దేశ్‌ముఖ్, సుకుమార్, గుణీత్ మోంగా, అనుపమా చోప్రా వంటి సినీ ప్రముఖులు 'క్రియేటివ్ సెంచరీ సాఫ్ట్ పవర్ అండ్ ఎంటర్‌టైన్ మెంట్' చర్చలో పాల్గొంటారు. దావోస్ లో ప్రతి ఏటా జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ను తలపించేలా అంతర్జాతీయ స్థాయిలో ఈ సదస్సు జరగాలని ముఖ్యమంత్రి స్వయంగా ఈ సదస్సు ఏర్పాట్లను నిరంతరం సమీక్షిస్తున్నారు. అధికారులతో ఇప్పటికే పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు వేదికలో రెండో రోజైన డిసెంబర్ 9న రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ను ఆవిష్కరిస్తుంది. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్ మ్యాప్‌ను ఈ డాక్యుమెంట్‌లో పొందుపరిచారు. రెండు రోజుల పాటు జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో అన్ని రంగాల్లో భవిష్యత్తు తెలంగాణ అభివృద్ధికి అవసరమైన పెట్టుబడులు, టెక్నాలజీ భాగస్వామ్యాలు, నూతన ఆవిష్కరణల దిశగా సమగ్ర ప్రణాళికలను పొందుపరిచారు.





**డిప్యూటీ సీఎంతో చిరంజీవి, నాగార్జున భేటీ**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సినీ ప్రముఖులు చిరంజీవి, నాగార్జున భేటీ అయ్యారు. గ్లోబల్ సమ్మిట్ కు సినీ ప్రముఖులు రావాలని భట్టి ఆహ్వానించారు. తప్పకుండా వస్తామని చెప్పారు. విజన్ 2027లో సినీ పరిశ్రమకు సంబంధించిన అంశాలు కూడా పొందుపరచగా, వాటిని చర్చించారు.

**అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాట్లు**

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుంది. ఇప్పటికే ఈ సమ్మిట్‌కు రావాలని ప్రధాన మంత్రి, కేంద్రమంత్రులు, జాతీయ స్థాయి ప్రతిపక్ష నేతలు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానించింది. ఈ సదస్సు డిసెంబర్ 8,9 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ సమ్మిట్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన భారత్ ఫ్యూచర్ సిటీలో మౌలిక వసతుల పనులను ప్రభుత్వం వేగవంతంగా పూర్తి చేస్తోంది. సదస్సు జరిగే ప్రాంతంలో భారీ స్థాయిలో విద్యుత్, స్టేజ్‌లు, సమావేశ హాళ్లు, భద్రత, ల్యాండ్‌స్కేపింగ్ పనులు మూడు షిఫ్ట్‌లుగా కొనసాగుతున్నాయి. ఈ సదస్సులో భాగంగా రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి దిశానిర్దేశం చేసే 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్ ను ఆవిష్కరించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో పరిశ్రమలు, టెక్నాలజీ, మౌలిక వసతులు, పట్టణాభివృద్ధి, ఉపాధి అవకాశాలు తదితర ముఖ్య రంగాలకు సంబంధించిన దీర్ఘకాల ప్రణాళికలు ఉండనున్నాయి. సమ్మిట్‌లో దేశీయ, అంతర్జాతీయ స్థాయి పారిశ్రామికవేత్తలు, వ్యాపార సంస్థలు, పెట్టుబడిదారులు, టెక్నాలజీ సంస్థలు పాల్గొననున్నారు. పెట్టుబడులకు అనుకూల విధానాలు, అవకాశాలు, ప్రాజెక్టులు ఈ వేదికలో ప్రదర్శించబడతాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ మ్యాప్‌పై మరింత ప్రాధాన్యత పొందే అవకాశముందని నిపుణులు భావిస్తున్నారు.

**యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు**

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఏర్పాట్లు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. ఆదివారం ఉదయంలోపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, ఆ తర్వాత 'డ్రై రన్' నిర్వహించడానికి నిర్వాహక కమిటీ ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం ట్రైయల్ రన్‌గా అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆ సమయంలో అన్ని కార్యక్రమాల్లో తప్పొప్పులను విశ్లేషించుకుంటారు. వాటిని వెంటనే సరిదిద్దుకుంటారని అధికారులు చెప్పారు.

**10జీబీ ఇంటర్‌నెట్ సేవలు**

ఈ సమ్మిట్‌లో ఇంటర్‌నెట్‌కు సంబంధించి ఎటువంటి సమస్యలు రాకుండా ఉండటం కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగానే తెలంగాణ ఫైబర్ గ్రిడ్ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సమ్మిట్ ప్రాంగణంలో అండర్‌గ్రౌండ్ ఇంటర్నెట్ నెట్‌వర్క్‌ను రెడీ చేసింది. దీని ద్వారా 5 జీ డేటాను 10 జీబీపీఎస్ స్పీడ్‌తో అందించనుంది. ఒకే కాలంలో 10 వేల మంది ఇంటర్‌నెట్ వినియోగించుకునేలా ఏర్పాట్లు చేసింది. ఈ సమయంలో ఎటువంటి సాంకేతిక, భద్రత సమస్యలు తలెత్తకుండా, మొత్తం వ్యవస్థను పర్యవేక్షించడానికి టిఫైబర్ వేదికకు దగ్గరే నెట్‌వర్క్ ఆపరేషన్స్ సెంటర్ (ఎన్ఓసీ)ని ఏర్పాటు చేసింది. దీనిని రాత్రింబవళ్లు పర్యవేక్షణ కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. ప్రతినిధులు వెంటనే ఇంటర్నెట్ కనెక్ట్ చేసుకునేందుకు, కమ్యూనికేషన్ సాఫీగా సాగేందుకు, రియల్‌టైమ్ ఆపరేషన్లు కొనసాగడానికి వీలుగా ఒకే దశ క్యూఆర్ కోడ్ ఆధారిత లాగిన్ సౌకర్యం కల్పించింది.

**అంతరాయం లేని విద్యుత్**

గ్లోబల్ సమ్మిట్ సమయంలో ఏ మాత్రం విద్యుత్ అంతరాయం రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. సమ్మిట్ జరిగే ప్రాంతానికి రెండు కిలోమీటర్ల దూరం వరకు అండర్‌గ్రౌండ్ విద్యుత్ లైన్‌లను ఏర్పాటు చేశారు. శనివారం నుంచి సదస్సు ముగిసే వరకు కూడా క్షణం కూడా విద్యుత్ సరఫరా ఆగకుండా చర్యలు తీసుకోనున్నారు. ఇందుకోసం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం) 150 మంది సిబ్బందిని నియమించింది. మీర్ఖాన్‌పేటలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ నుంచి సదస్సు జరిగే ప్రాంతానికి రెండు కిలో మీటర్ల నిడివి కలిగిన డబుల్ సర్క్యూట్‌తో భూగర్భంలో విద్యుత్ లైనును ఏర్పాటుచేశారు. ఒక 100 కేవీ, రెండు 160 కేవీ, రెండు 315 కేవీ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లను ప్రాంగణంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు.

**భారీ భద్రత**


గ్లోబల్ సమిట్‌కు దేశ విదేశాల నుంచి కీలక అతిథులు, ప్రముఖులు హాజరుకానుండటంతో తెలంగాణ పోలీసు శాఖ అతి కట్టుదిట్టమైన భద్రతా చర్యలను చేపట్టింది. ఈ నేపథ్యంలో సమిట్ వేదికగా ఉన్న వంద ఎకరాల ప్రాంగణం మొత్తం భద్రతా పరంగా నిఘాలోకి తీసుకున్నారు. ప్రాంగణం అంతటా దాదాపు వెయ్యి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని సెంట్రల్ పోలీస్ కంట్రోల్ రూమ్‌తో అనుసంధానం చేశారు. ఎప్పటికప్పుడు పరిస్థితులను పరిశీలిస్తూ ఏవైనా అనుమానాస్పద అంశాలు గుర్తించిన వెంటనే చర్యలు తీసుకునేలా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. శాంతిభద్రతల పర్యవేక్షణ కోసం హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్‌లు అలాగే మహబూబ్‌నగర్ జిల్లా నుండి మొత్తం 1,500 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. సమిట్ ప్రాంత చుట్టుపక్కల ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు మరో 1,000 మంది ట్రాఫిక్ పోలీసులకు బాధ్యతలు ఇచ్చారు. సమిట్ సమయంలో రహదారుల మళ్లింపు, బారికేడ్ల ఏర్పాటు, వాహనాల పార్కింగ్ నిర్వహణ కోసం ట్రాఫిక్ మార్షల్స్‌ను కూడా అధికారులు సిద్ధంగా ఉంచారు. ముఖ్య అతిథుల రాకపోకలు ఎటువంటి అంతరాయాలు లేకుండా చూసేందుకు విస్తృత ప్రణాళికను అమలు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. భద్రతా చర్యలను ఇంకా సమీక్షిస్తూ అవసరమైతే అదనపు బలగాలను కూడా పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు.

**అంతా ఎల్ఈడీ స్క్రీన్‌లే**

సదస్సు ప్రాంగణమంతా ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేయనున్నారు. ప్రధాన ప్రాంగణం ఎదుట 85 మీటర్ల వెడల్పుతో భారీ తెరను ఏర్పాటు చేయనున్నారు. అంతేకాకుండా హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారి నుంచి ఫ్యూచర్ సిటీ వేదిక వరకు రోడ్డు మొత్తం ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేయనున్నారు. సదస్సులో జరిగే అన్ని కార్యక్రమాలను, సదస్సుకు సంబంధించిన సమాచారాన్ని వాటిపై ప్రదర్శించనున్నారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 8 వేదికల్లో.. 3,000 టన్నుల సామర్థ్యంతో కూడిన ఏసీ యంత్రాలను అమర్చారు.

## ఘనంగా హోంగార్డు వ్యవస్థాపక దినోత్సవం పరేడ్

**సూర్యపేట జిల్లా మహా:** 63వ హోంగార్డు ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని శనివారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయం నందు హోంగార్డ్ ఆఫీసర్స్ పరేడ్ ను ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ నర్సింహ ముఖ్యఅతిథిగా హాజరై గౌరవ వందనం స్వీకరించి హోంగార్డ్ ఆఫీసర్స్ నిర్వహించిన పరేడ్ ను తిలకించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డ్ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎంత పని ఒత్తిడి ఉన్నప్పటికీ హోంగార్డ్ ఆఫీసర్స్ సంక్షేమంలో భాగంగా హోంగార్డు ఆఫీసర్స్ గుర్తింపులో భాగంగా ఈ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి ఈ సందర్భంగా క్రీడా పోటీలు,రక్తదాన శిబిరాలు నిర్వహించడం జరిగినదన్నారు. పూర్తిస్థాయిలో శిక్షణ పొందిన పోలీసు సిబ్బందితో సమానంగా కొన్ని సందర్భాలలో పోలీస్ సిబ్బంది కంటే ఎక్కువగా హోంగార్డు ఆఫీసర్స్ విధులు నిర్వర్తిస్తున్నారని, సాంకేతిక విధులు, సిసిటిఎన్ఎస్ విధులు, రైటర్స్ గా విధులు నిర్వర్తించడంలో హోంగార్డ్ ఆఫీసర్స్ ముందున్నారని, వైపరీత్యాల సమయంలోను,వరదల సమయంలోనూ కష్టపడి పని చేస్తున్నారు,ప్రజల




ధన, మాన,ప్రాణ రక్షణలో నిరంతరం పని చేస్తున్నారని ఆయన అభినందించారు. క్రమశిక్షణతో ఉంటూ ప్రజలకు ఉత్తమమైన పరదర్శకమైన సేవలు వేగంగా అందిస్తూ పోలీస్ శాఖకు తెలంగాణ రాష్ట్ర పోలీసులు, హోంగార్డు శాఖకు మంచి పేరు తేవాలని కోరారు. హోంగార్డ్ ఆఫీసర్ సంక్షేమం కోసం జిల్లా పోలీస్ శాఖ అనుక్షణం కృషి చేస్తుందని దీనిలో భాగంగానే విధుల నిర్వహణలో ఎండ, వాన, చలి నుండి రక్షణగా రైన్ కోట్స్, ఉలెన్ జెర్కిన్స్, కంటి అద్దాలు అందిస్తున్నాం అన్నారు. అలాగే పిల్లల చదువుల నిమిత్తం ఆరోగ్య ఖర్చుల నిమిత్తం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి హోంగార్డ్ సంక్షేమ నిధి నుండి ఆర్థిక సాయం అందిస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని, చదువులో ప్రతిభ చూపుతున్న విద్యార్థులకు నగదు పారితోషికం అందిస్తామని అన్నారు. ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు ఉత్తమ ప్రతిభ చూపిన వారికి మొదటి బహుమతిగా 18000 వేల రూపాయలు,రెండో బహుమతిగా 15000మూడవ బహుమతిగా 12000 రూపాయలు ప్రోత్సాహకం అందిస్తామని, పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపుతున్న వారికి మొదటి బహుమతిగా 15000 రెండో బహుమతిగా 10000 మూడో బహుమతిగా 8000 రూపాయలు ప్రోత్సాహకంగా ఇస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా విధులలో ఉత్తమ ప్రతిభ చూపిన హోంగార్డ్ ఆఫీసర్స్ కు ప్రశంసా పత్రాల అందించి అభినందించారు. హోంగార్డు వ్యవస్థాపక దినోత్సవం గుర్తుగా హోంగార్డ్ ఆఫీసర్స్ తో కలిసి జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఎస్పీ మొక్కలు నాటడం జరిగినది.ఈ కార్యక్రమంలో ఆర్మడ్ అదనపు ఎస్పీ జనార్దన్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, హోంగార్డు ఇన్చార్జి ఆర్ఎస్ఐ అశోక్, ఇతర ఆర్ఎస్ఐలు సురేష్, సాయిరాం, రాజశేఖర్, ఏ ఆర్ ఎస్ ఐ వెంకన్న, పర్యటన నిర్వహించిన హోంగార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా 63వ హోంగార్డు రైజింగ్ డే

**ఆదిలాబాద్ మహా :** జిల్లా పోలీస్ సిబ్బందితో సరిసమానంగా విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డు సిబ్బందికి 63వ హోంగార్డు రైజింగ్ డే శుభాకాంక్షలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ పరేడ్ మైదానం లో నిర్వహించిన పరేడ్ కు ఆయన హాజరయ్యారు. హోంగార్డులు స్వతంత్ర భారతదేశంలో స్వచ్ఛంద సంస్థగా 1946 డిసెంబర్ 6వ తేదీన భారత ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 6న హోంగార్డు రైజింగ్ డే గా నిర్వహిస్తామన్నారు. విధినిర్వహణలో తమదైన ప్రతిభ చాటుతూ, జిల్లా పోలీసు కీర్తి ప్రతిష్టలలో తమ వంతు పాత్ర పోషిస్తున్న హోంగార్డు సిబ్బందికి ప్రత్యేకంగా ఎస్పీ అభినందనలు తెలిపారు. హోంగార్డు సిబ్బందికి దినసరి వేతనం రూ 920 నుండి 1000 రూపాయలకు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లాలో మొట్టమొదటిసారిగా హోంగార్డ్ సిబ్బందికి ఆరోగ్య భద్రత కార్డులను అందజేసినట్టు తెలిపారు. ఈ కార్డుల ద్వారా స్థానికంగా ఉన్న ఆదిలాబాద్



ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సహకారంతో ప్రతి ఆసుపత్రి నందు ఉచితంగా కన్సల్టేషన్ ఇవ్వబడుతుందన్నారు. ఇన్ పేషంట్ సిబ్బందికి టెస్టుల నందు, బిల్లు నందు రాయితీ ఉంటుందని తెలిపారు.ఈ సంవత్సరం నూతనంగా ఐదు లక్షలు ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. శాలరీ ప్యాకేజీ ద్వారా ప్రైవేటు బ్యాంకు సహకారంతో రోడ్డు ప్రమాదం సంభవించినప్పుడు ఉద్యోగి మరణిస్తే 30 లక్షల వరకు భీమా సౌకర్యం ఉందని తెలిపారు. అనంతరం విధులలో ప్రతిభ కనబరిచిన 16 మంది హోంగార్డ్ పోలీసు సిబ్బందికి ప్రశంస పత్రాలను అందజేసి అభినందించారు. గాంజా , గుడుంబా, లాంటి వాటిపై సమాచారం అందించిన, ప్రమాదంలో ఉన్న వ్యక్తులను కాపాడిన సందర్భాలలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువస్తే నగదు రివార్డులను అందజేస్తామని తెలిపారు. చలికాలంలో ఉపయోగకరంగా ఉండే ఉలెన్ జాకెట్స్, వర్షాకాలంలో వినియోగించే రైన్ కోట్స్ ను అందజేసినట్టు తెలిపారు. సిబ్బంది ప్రతి ఒక్కరు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని, విధులలో నిర్లక్ష్యం పనికిరాదని, నీతి నిజాయితీలతో విధుల నిర్వహణ చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ డి ఎస్ పి కమతం ఇంద్రవర్ధన్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి వెంకటి, టి మురళి ,ఎల్ శ్రీకాంత్ హోంగార్డ్ ఆర్ ఐ ఎన్ చంద్రశేఖర్, సబ్ ఇన్స్పెక్టర్లు రాకేష్, గబ్బర్ సింగ్, ఆశన్న, హోంగార్డు సిబ్బంది సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగం ప్రపంచానికి ఆదర్శం

ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,
వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి,పోతు భాస్కర్

**సూర్యాపేట జిల్లా మహా:** భారత దేశ రాజ్యాంగ నిర్మాణం కోసం కృషి చేసిన డా.బీఆర్ అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ నెరవేర్చే దిశగా పయనించాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోతం రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్ అన్నారు. శనివారం సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ ఎస్సి సెల్ ఆధ్వర్యంలో డా.బీఆర్ అంబేద్కర్ వర్ధంతి పురస్కరించుకుని ఖమ్మం రోడ్డు సమీపంలోని విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ చిన్న కుటుంబంలో పుట్టిన స్వశక్తిగా ఎదిగి ప్రపంచ నాయకునిగా ఏదిగారు.బావితరాలకు మార్గదర్శిగా నిలిచారు. భారతదేశానికి రాజ్యాంగానికి అందించిన మహోన్నత వ్యక్తి, అత్యంత మేధా సంపత్తి కలిగిన గొప్ప దార్శనికుడు డా.అంబేద్కర్ అని అన్నారు.వారి జీవితం మొత్తం దేశానికి, అణగారిన పేద బడుగు బలహీన వర్గాల కోసం త్యాగం చేసిన మహనీయుడు అని కొనియాడారు. రాజ్యాంగ పితామహుడు.ప్రపంచ మేధావి అంబేద్కర్ బాటలో ప్రజలు పయనించాలని అన్నారు.



కుల,మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా జీవించాలని సూచించారు కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపి అక్షరాన్ని ఆయుధంగా మలిచి జ్ఞానాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు అంబేద్కర్ అని అన్నారు.సమాజంలోని నిమ్నజాతి వర్గాలకు రాజ్యాధికారాన్ని చేరువ చేసే దిశగా వైపు అంబేద్కర్ రాజ్యాంగ రచన చేసినట్లు వివరించారు. అంబేద్కర్ కృషి వల్లే నేడు అణగారిన వర్గాలు ఆత్మ గౌరవంతో జీవిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తోందన్నారు.

### ఎన్నికల ప్రవర్తన నియమావళిని తూచా

## తప్పకుండా పాటించాలి

ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు రవి నాయక్



**సూర్యాపేట జిల్లా మహా:** గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఏవైనా సమస్యలు,సమాచారాన్ని తెలియజేసేందుకు తన ఫోన్ నెంబర్ 9676845846 కు తెలియజేయాలని గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు రవి నాయక్ ఒక ప్రకటనలో తెలిపారుసూర్యాపేట జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, శాంతియుత వాతావరణం లో సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాల్సిన అవసరం ఉందని అన్నారు. అదే సమయంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని తూచా తప్పకుండా పాటించాలని ఆయన కోరారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన,అలాగే ఎన్నికలకు సంబంధించి ఏవైనా సమస్యలను, ఫిర్యాదులను నేరుగా తన ఫోన్ నెంబర్ కు తెలియజేయాలని ఆయన కోరారు.

## జైనూర్‌లో ఫ్లాగ్ మార్చ్

**జైనూర్ మహా:** కొమురం భీం అసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలో జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు జైనూర్ మండల కేంద్రంలో పలు వీధులగుండా పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల దృష్టిలో పెట్టుకొని జైనూర్ పోలీస్ స్టేషన్ నుంచి బాలాజీ నగర్ శివాజీ నగర్ పవర్ హౌస్ కాలనీ వీకర్ సెక్షన్ కాలనీ తో పాటు రామ్ నగర్ దాకా పోలీస్ సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్టు సీఐ రమేష్ తెలిపారు. పంచాయతీ ఎన్నికలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా నిర్వహించాలన్నారు. ప్రతి ఓటరు ఓటు వినియోగించుకోవాలని డబ్బులు పంచడం లేదా భయభ్రాంతులకు గురి చేస్తే వెంటనే తమ దృష్టికి తీసుకొని రావాలని అన్నారు .ఎన్నికల



కోడ్ సందర్భంగా ఎవరైనా ర్యాలీ లేదా ధర్నా లు చేపడితే జిల్లా ఎస్పీ పర్మిషన్ తీసుకోవాలని అన్నారు. పర్మిషన్ లేకుండా నిర్వహిస్తే వారిపై కటిన చర్యలు తీసుకుంటామన్నారు.కార్యక్రమంలో జైనూర్ ఎస్సై రవికుమార్ ,సిర్పూర్ ఎస్ ఐ రామకృష్ణ, లింగపూర్ ఏస్ ఐ గంగన్న పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు....

### కన్నుల పండవగా

## ఆరట్టు ఉత్సవం

**నిర్మల్ మహా :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని అయ్యప్ప హరిహర క్షేత్రం మల్లన్న గుట్ట స్వామి ఆలయంలో అయ్యప్ప ఆరట్టు మహోత్సవంను శనివారం కన్నుల పండువాగా నిర్వహించారు. గోదావరి నది జలాలు, పంచామృతాలతో గణపతి సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్ప విగ్రహాలకు అభిషేకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోద మురళీధర్ రెడ్డి, ఆలయ గురు స్వామి నవయుగ మూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి పల్లకి ఊరేగింపు పట్టణ పురవీధుల గుండా కొనసాగింది. ప్రతి సంవత్సరం లాగే డిసెంబర్ మొదటి శనివారం ఈ ఆరట్టు మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

## సీ.ఐ.టి.యు. మహాసభలను విజయవంతం చేయండి

భీమారం,జైపూర్ లలో గోడపత్రాలు విడుదల

**భీమారం, మంచిర్యాల : మహా:** డిసెంబర్ 7,8,9 తేదీలలో జరిగే సీఐటియు రాష్ట్ర 5వ మహాసభలలో కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం జయప్రదం చేయాలని ఆ సంఘం మండల నాయకురాలు మనబోతుల మదునమ్మ, రంగు సరితలు పిలుపునిచ్చారు. శనివారం భీమారం, జైపూర్ మండలాలలో సీఐటియు మూడు రోజుల మహాసభల గోడపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోడీ బీజేపీ ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్ ను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దానికి సహకరించడం చాలా దారుణమని అన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా లేబర్ కోడ్స్ రద్దు కై సీఐటియు పోరాటం చేస్తుందని విన్నవించారు. ఈ చట్టాలు అమలు జరిపి కార్మికులను బానిసలుగా మార్చడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయి. బ్రిటిష్ కాలం నుండి ఎన్నో సమ్మె పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలను, హక్కులను రద్దు చేస్తూ, కార్పొరేట్ కంపెనీలకు, పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చే విదంగా ఈ చట్టాలను తెచ్చారని స్పష్టం చేశారు. మధ్యాహ్నం భోజన కార్మికులు పరిస్థితి చాలా దుర్భరంగా మారిందని వారు వాపోయారు. సకాలంలో




బిల్లులు విడుదల చేయకుండా ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకుంటూ కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తుందని ఆరోపించారు. మెనూ ప్రకారంగా బడ్జెట్ ను పెంచాలని డిమాండ్ చేశారు. కోడిగుడ్లు, గ్యాస్ ను ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని పేర్కొన్నారు. ప్రతి కార్మికురాలికి ప్రతినెల 10 వేల రూపాయల వేతనం చెల్లించాలని కోరారు. అర్హులైన నిరుపేద కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా ఆందోళన పోరాటాలను, భవిష్యత్తు కార్యచరణను ఈ రాష్ట్ర మహాసభలలో చర్చించుకోవడం జరుగుతుందని వెల్లడించారు. సభలను పురస్కరించుకొని డిసెంబర్ 7 న మెదక్ పట్టణంలో జరిగే ర్యాలీ ప్రదర్శన, బహిరంగ సభలో అధిక సంఖ్యలో కార్మిక వర్గం పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

### బీర్ల అయిలయ్య సమక్షంలో

## కాంగ్రెస్‌లో చేరికలు

**ఆలేరు, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం రాఘవపురం గ్రామ BRS. పార్టీ నాయకులు ,మహిళలు పెద్ద ఎత్తున శనివారం కాంగ్రెస్ పార్టీలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు మాజీ MPTC ఆరే ప్రశాంత్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు మేకల ఉపేందర్, సాయబోయిన శివకుమార్ తాళ్ల సాంబరాజు కాంగ్రెస్ పార్టీ నాయకుల సమక్షంలో చేరారు ఉప్పలి రాజు,పారుపల్లి కృష్ణారి, ఉప్పలి ఉపేందర్, ఉప్పలి రవీందర్, ఉప్పలి ఈశ్వరయ్య, ఉప్పలి పౌరు, వస్పరి రాజాలు, వస్పరి మల్లేష్,సాయబోయిన సిద్ధులు,సాయబోయిన నాగరాజు, ఉప్పలి మహేందర్,ఎర్ర మహేందర్,ఎర్ర కిష్టయ్య, కర్రె సాగర్, ఆరె ఉదయ్ కాంగ్రెస్ పార్టీలో బీర్ల అయిలయ్య చేతుల మీదుగా కాంగ్రెస్ కండువా కప్పు కున్నారు


### విద్యార్థులకు పిల్లల చట్టాలు మరియు వారి సమస్యల

## పరిష్కార మార్గాలపై అవగాహన కార్యక్రమం

**సూర్యాపేట జిల్లా మహా** సూర్యాపేట జిల్లా కస్తూరిబా గాంధీ విద్యాలయం చివ్వేంల నందు బాల రక్ష భవన్ జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో పిల్లల చట్టాలు మరియు వారి సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ షేక్ నాగుల్ మీరా,బాలల పరిరక్షణ విభాగం వి.వి. శ్రీలక్ష్మి,చైల్డ్‌లైన్ సభ్యుడు కిరణ్పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు బి,నాగలక్ష్మి లు మాట్లాడుతూ ఈ రోజుల్లో ప్రతి విద్యార్థి ఆలోచనా విధానంలో మార్పు రావాలని,భవిష్యత్తుపై స్పష్టమైన లక్ష్యంతో చదువుకోవాలని, ప్రతి విద్యార్థి సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకునే విధంగా తమ భవిష్యత్తు కార్యచరణను సిద్ధం చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు మీ మీద పెట్టుకున్న ఆశలు, నమ్మకాన్ని మన చదువు మరియు విజయాలతో నిలబెట్టాలన్నారుపిల్లలు బాగా చదివి మంచి పేరు తేవడం ద్వారా మాత్రమే తల్లిదండ్రులపై ఉన్న బాధ్యతను తీరుస్తామని వివరించారు.పిల్లల హక్కులు,వారి బాధ్యతలు గురించి వివరించారు.ప్రస్తుత పరిస్థితుల్లో ప్రేమ పేరుతో పిల్లలు ఎలా మోసపోతున్నారో కొన్ని ఉదాహరణలు చెబుతూ, పాఠశాల దశలోనే విద్యార్థులు



తమ ప్రవర్తన, ఆలోచన విధానాన్ని మార్చుకుని జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు భవిష్యత్తు, సమాజం, తల్లిదండ్రుల పరిస్థితులు, ప్రస్తుత కాల ప్రభావాలకు లోనూ కాకుండా అర్థం చేసుకుని ముందుకు సాగాలని చెప్పారు.నిరుపేద కుటుంబాల నుండి వచ్చిన పిల్లలు తల్లిదండ్రుల ప్రేమను గౌరవించి, అన్ని విషయాల్లో పరిజ్ఞానం పెంపొందించుకుని పాఠశాలకు మంచి పేరు తెచ్చించాలని సూచించారు.చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 గురించి పిల్లలకు అవగాహన కల్పించారు.పాఠశాల దశలో తీసుకునే నిర్ణయాలు జీవితానికి పునాది వంటివని, మంచి స్నేహాలను మాత్రమే ఎంచుకోవాలని, చెడు స్నేహితులను దూరంగా ఉంచాలని, పెద్దల పట్ల గౌరవం, విధేయతతో ఉండాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలోఅధ్యాపక బృందం ఉపాధ్యాయులు దీపికా, సరిత, కమలాక్షి, నాగ లక్ష్మీ మరియు పాఠశాల విద్యార్థినిలు పాల్గొన్నారు.



### సమాజంలో పేద వర్గాలు గౌరవం పొందుతున్నారంటే

## కారణం అంబేద్కర్

హుజూర్ నగర్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కోతిసంపత్ రెడ్డి

**హుజూర్ నగర్ మహా:** భారతదేశానికి ఆత్మగా నిలిచిన రాజ్యాంగాన్ని అందించిన భారతరత్న బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం విజయవాడ లో గల డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ 125 అడుగుల సామజిక న్యాయ శిల్పం దగ్గర ఆ మహనీయుని స్మృతికి హుజూర్ నగర్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కోతిసంపత్ రెడ్డి, సులవచంద్రశేఖర్, దగ్గుబాటి బాబురావు లునివాళులు అర్పించారు నేడు సమాజంలో పేదలకు, బడుగు వర్గాలకు న్యాయం జరుగుతుందంటే వారి స్వరం బలంగా వినిపిస్తుందంటే,వారు తగిన రక్షణ, గౌరవం పొందుతున్నారంటే దానికి కారణం అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అణగారిన వర్గాల్లో సాంఘిక, రాజకీయ, విద్యా చైతన్యాలను రగిలించిన స్ఫూర్తి ప్రదాత అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుందాం.రాజ్యాంగంలో హక్కులతో పాటు బాధ్యతలనూ పాటించడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని వారు అన్నారు.

## ఎన్నికల విధులకు హాజరు కాకుంటే సస్పెన్షనే

జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**యాదాద్రి భువనగిరి, మహా:** ఎన్నికల విధులకు, శిక్షణ తరగతులకు హాజరు కాని వారిపై సస్పెన్షన్ వేటు తప్పదని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో గ్రామపంచాయతీ సాధారణ మూడు విడతల్లో జరిగే ఎన్నికలకు సంబంధించి శిక్షణ తరగతులకు ఎవరైనా గైర్హాజరు అయినా, ఎన్నికల విధులు ఆర్డర్ కాపీ తీసుకోకపోయిన, ఎన్నికల విధులకు హాజరు కాకపోయిన వారిపై సస్పెన్షన్ వేటు తప్పదని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎన్నికల విధులు ప్రతి ఒక్కరు సక్రమంగా నిర్వహించి ఎన్నికలు సజావుగా జరిగేందుకు బాధ్యతతో విధులు నిర్వహించాలన్నారు. జోనల్,రిటర్నింగ్, ప్రిసైడింగ్, అధికారుల శిక్షణ తరగతుల్లో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కలెక్టర్ హనుమంత రావు... మొదటి విడత జరిగే గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల విధులు చాలా కీలకమైనదని, ప్రతి అంశం పైన క్షుణ్ణంగా అవగాహన కల్పించుకుని విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హనుమంత రావు సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం ఆలేరు,రాజాపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లోతొలి విడతగా ఆలేరు, రాజాపేట, యాదగిరిగుట్ట, ఆత్మకూర్, బొమ్మలరామారం, తుర్కపల్లి లోని మండలాలలో ఈ నెల 11న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, స్టేజ్ 2 శిక్షణ లో జోనల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ తరగతులలో కలెక్టర్, రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామ



పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తుగానే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. నియమ, నిబంధనలపై పూర్తి అవగాహనను ఏర్పర్చుకోవాలని, ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా నిబంధలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని హితవు పలికారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సమయ పాలనను పకాగా పాటిస్తూ, అప్రమత్తతో ఎన్నికలు నిర్వహిస్తే ఇబ్బందులు తలెత్తేందుకు ఆస్కారం ఉండదని తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు సజావుగా జరిగేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని, పోలింగ్ మెటీరియల్ ను జాగ్రత్తగా ఒకటికి రెండుసార్లు సరి చూసుకోవాలని, ముఖ్యంగా బ్యాలెట్ పేపర్ల విషయంలో ప్రత్యేక జాగరూకతతో వ్యవహరించాలని అన్నారు. ఎన్నికల విధుల పట్ల ఆర్.ఓలు తమ బృందంలోని ఎన్నికల సిబ్బంది అందరికీ నియమ, నిబంధనల పట్ల పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఎక్కడ కూడా తప్పిదాలకు తావు లేకుండా సజావుగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయగలుగుతారని అన్నారు.

### గ్రామంలో కోతులు,

## కుక్కల బెడద లేకుండా చేస్తా

**ఆలేరు, మహా :** గ్రామంలో కోతుల బెడద లేకుండా చేస్తానని, ప్రజలకు ఏ కష్టం వచ్చిన కంటికి రెప్పలా ఆదుబాటులో వుండి ఆదుకుంటానని తనను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం గుండ్లగూడెం గ్రామ సర్పంచ్ గా పోటీలో వున్న బిఆర్ఎస్ అభ్యర్థి ఏసిరెడ్డి మంజుల మహేందర్ రెడ్డిలు కోరారు. ప్రధానంగా రైల్వే గేటు సమస్య కోసం పోరాడుతామని,కుక్కల బెడద నివారిస్తామన్నారు వారు హామీ ఇచ్చారు... నేడు బిఆర్ఎస్ కార్యకర్తలు ,అభిమానులతో కలిసి గ్రామంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు... ఈ కార్యక్రమంలో మండల,గ్రామ బిఆర్ఎస్ నాయకులు మొరిగాడి వెంకటేష్, పుట్ట మల్లేష్,చెక్కిల్ల శ్రీనివాస్,గంపల విజయ్,జయరాం నాయక్, ఎల్లా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళల్లో ఆత్మవిశ్వాసం కోసం...

**ఆదిలాబాద్ మహా :** ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ధైర్యంగా ఎదుర్కొనే ఆత్మవిశ్వాసం మహిళల్లో పెరగాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మహిళలపై హింసకు వ్యతిరేకంగా నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు జరుగుతున్న అంతర్జాతీయ ప్రచారోద్యమం చేపడుతున్నారు.ఈనేపథ్యంలో, సఖి కేంద్రం, జిల్లా మహిళా, శిశు, వికలాంగుల, వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళలపై హింస నిర్మూలన కోసం సమాజమంతా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. కుటుంబం నుంచి కార్యాలయం వరకు ప్రతి స్థాయిలో మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించడం ప్రభుత్వంతో పాటు సమాజ పౌరుల బాధ్యత అని పేర్కొన్నారు. అవగాహన కార్యక్రమాలు కేవలం రూపచిత్రాలుగా కాకుండా, ప్రతి ఒక్కరి ఆలోచనల్లో మార్పు తీసుకువచ్చే దిశగా సాగాలని అన్నారు. మహిళలు చైతన్యవంతులై తమ హక్కులపై అవగాహన పెంచుకున్నప్పుడే నిజమైన సామాజిక మార్పు సాధ్యమవుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. అవసరంపై వెంటనే సహాయం పొందేందుకు సఖి కేంద్రం, మహిళా హెల్ప్‌లైన్ 181 వంటి సేవలను వినియోగించుకోవాలని మహిళలకు సూచించారు. కార్యక్రమంలో భాగంగా బాలికలు వివిధ హోదాల్లో మహిళలు నిర్వర్తించే బాధ్యతలను ప్రతిబింబించే ప్రదర్శనలు అందించారు. కోలాం ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాల విద్యార్థినులు బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు మహిళలు ఎదుర్కొనే సవాళ్లు, వాటిని అధిగమించే ధైర్యాన్ని నాటిక రూపంలో ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

## గ్రామ అభివృద్ధి నా లక్ష్యం

లింగస్వామి గౌడ్



**వలిగొండ, మహా:** గ్రామంలో నేను చేసిన సేవలను గుర్తించి నన్ను గెలిపించాలని గ్రామాన్ని అభివృద్ధి చేయడమే నా లక్ష్యమని లింగరాజు పల్లి గ్రామ బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి బొడిగే లింగస్వామి గౌడ్ అన్నారు ఆశీర్వదించి గెలిపిస్తే గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని అంతేకాకుండా గ్రామంలో ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ ఎవరి సమస్యనైనా పరిష్కారం కోసం కృషి చేస్తానని గ్రామంలోని సమస్యలపై ప్రభుత్వంతో పోరాడి నిధులు తీసుకువచ్చి గ్రామ సమస్యలను నెరవేరుస్తానని అన్నారు లింగరాజు పల్లి గ్రామ ప్రజలు నాకు ఒకసారి అవకాశం ఇచ్చి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే నిస్వార్థంగా సేవ చేస్తానని అన్నారు

## భారతీయ సంస్కృతికి ప్రతీక యోగా..

మంత్రులు బండి సంజయ్ పొన్నం ప్రభాకర్

**కరీంనగర్ మహా ;** భారతీయ సంస్కృతి సాంప్రదాయానికి ప్రతీక యోగా అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు శనివారం ఉదయం కరీంనగర్ లోని మహాశక్తి ఆలయంలో ఇటీవల రంగారెడ్డి జిల్లాలోని ఎస్ఎంపీ అంతర్జాతీయ పాఠశాలలో తెలంగాణ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయిలో పథకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికైన జిల్లా యోగా క్రీడాకారులను అభినందిస్తూ జాతీయస్థాయిలో కూడా పథకాలు సాధించాలని కోరినారు ప్రపంచానికి భవద్గీతను అందించిన భారతదేశం నేడు యోగాను విశ్వవ్యాప్తంగా అమలు చేయడం భారతదేశము యొక్క కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. రాష్ట్ర రవాణా మరియు బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ యోగా సాధన వలన సార్వత్రిక శక్తి ఆధ్యాత్మిక జ్ఞానం కలుగుతుందని మరియు వ్యక్తి పరిపూర్ణతకు యోగా దోహదపడుతుందని అన్నారు కావున ప్రతి ఒక్కరూ యోగాలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. యోగాను ముందు తరాల వారికి అందించాలనే లక్ష్యంతో యోగా క్రీడాకారుల సంక్షేమాన్ని



గుర్తించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యోగాను స్పోర్ట్స్ కోటాలో చేర్చారని తెలంగాణ యోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ అన్నారు. ఎంపికైన క్రీడాకారులు రాంచి లో ఈనెల 27 నుంచి 30 వరకు జరుగు జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవంపల్లి సత్యనారాయణ, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు వి. అంజనీ కుమార్, జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు నాగిరెడ్డి సిద్ధారెడ్డి, ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, కార్యదర్శి గుంటి రామకృష్ణ, కోశాధికారి పి. స్వరూప చారి, బండ రమణారెడ్డి యోగ కోచులు కిష్టయ్య ,ఆనంద కిషోర్, ప్రవీణ్ , వీణ తదితరులు పాల్గొన్నారు.



## సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**తుర్కపల్లి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేశారు మండలంలోని గంధమల్ల,ఇందిరా నగర్, వీరారెడ్డి పల్లి, తిరుమలపూర్,వాసాలమర్రి,కొండాపూర్,గోపాలపూర్,నాగాయపల్లి,మాదాపూర్ ,ధర్మారం గ్రామాల్లో సర్పంచుల గెలుపును కోరుతూ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో ఎమ్మెల్యే కు తోడుగా సర్పంచులను గెలిపించుకుంటే గ్రామ అభివృద్ధి జరుగుతోందని,అందుకే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను ఆయా గుర్తులకు ఓటు వేసి గెలిపించుకోవలన్నారు. ప్రచారంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్, వార్డ్ సభ్యులు,కాంగ్రెస్ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

# యంగ్ హీరో ఇంట్లో పెళ్లి సందడి..

బాలీవుడ్ యంగ్ హీరో కార్తీక్ ఆర్యన్ ఇంట్లో పెళ్లి సందడి. ఇతడి చెల్లి కృతికకు శుక్రవారం ఉదయం ఘనంగా వివాహం జరిగింది. పైలట్ తేజస్వి కుమార్ సింగ్‌తో ఏడడుగులు వేసింది. కార్తీక్ ఆర్యన్ సొంతూరు అయిన గ్వాలియర్‌లోని ఓ రిసార్ట్‌లో ఈ శుభకార్యం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ క్రమంలో పెళ్లి ఫొటోలు పోస్ట్ చేసిన కార్తీక్.. భావోద్వేగానికి గురై పోస్ట్ పెట్టాడు. 'నీ ప్రపంచం చాలా మారింది. అందులో ఈ రోజు ఒకటి. నా కికీని పెళ్లి కూతురిలా చూస్తుంటే ఇన్నేళ్లు ఒక్క క్షణంలా అనిపిస్తుంది. నువ్వు నా వెనక పరుగెత్తడం దగ్గర నుంచి ఇప్పుడు ఎంతో ఆనందంగా పెళ్లి కూతురిలా నడిచి వస్తున్నావ్. నిన్ను ఇలా చూస్తున్నందుకు చాలా గర్వంగా ఉంది. నువ్వు ఓ కొత్త జీవితాన్ని ప్రారంభించొచ్చు. కానీ ఎప్పటికీ నువ్వు నా చిట్టి చెల్లిలివే. ఈ ప్రయాణం నువ్వు కోరుకున్నవన్నీ ఇస్తుందనుకుంటున్నాను' అని కార్తీక్ ఆర్యన్ ఎమోషనల్ అయిపోయాడు. కార్తీక్ ఆర్యన్ ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండానే హీరోగా గుర్తింపు తెచ్చుకున్నాడు. 2011 నుంచి బాలీవుడ్‌లో మూవీస్ చేస్తున్నాడు. ప్యార్ కా పంచనామా, లూకా చుప్పీ, పతీ పత్నీ ఔర్ ఓ, భూల్ భులయ్యా 2, చందు ఛాంపియన్, భూల్ భులయ్యా 3 తదితర చిత్రాలతో క్రేజ్ సొంతం చేసుకున్నాడు. ఇతడి చెల్లి పేరు కృతిక తివారీ. ఈమె డాక్టర్. ఇప్పుడు ఈమెకే పెళ్లయింది. కార్తీక్ ప్రస్తుతం 'తూ మేరీ మైన్ తేరా మైన్ తేరీ తు మేరీ' అనే సినిమా చేశాడు. ఈ నెల 25న థియేటర్లలోకి రానుంది.



# బాలీవుడ్ నిండా మొసళ్లే..

ప్రముఖ బాలీవుడ్ నటి దివ్య ఖోస్లా ఆసక్తికర కామెంట్స్ చేసింది. బాలీవుడ్ ఇండస్ట్రీ మొత్తం మొసళ్లతో నిండిపోయిందంటూ సంచలన వ్యాఖ్యలు చేసింది. తాజాగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన దివ్య ఖోస్లా ఇండస్ట్రీని ఉద్దేశించి మాట్లాడింది. తాను విలువలతో రాజీ పడకుండా నిజాయితీగా ఉంటానని తెలిపింది. అవకాశాల కోసం తానెప్పుడు ఆత్మ గౌరవాన్ని అమ్ముకోనని దివ్య ఖోస్లా పేర్కొంది. ఆస్క్ మీ ఎనిథింగ్ పేరుతో నిర్వహించిన ఈ సెషన్‌లో పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చింది. దివ్య ఖోస్లా మాట్లాడుతూ..'బాలీవుడ్‌లో చాలా మొసళ్లు ఉన్నాయి. ఇది నా వ్యక్తిగత అభిప్రాయం. ఇక్కడ నువ్వు నిజాయితీగా ఉండటం చాలా ముఖ్యం. పని కోసం నా ఆత్మ గౌరవాన్ని నేను ఎప్పుడూ అమ్ముకోను. యూకేలో ఓ సినిమా కోసం సున్నా డిగ్రీల టెంపరేచర్‌లో దాదాపు 42 రోజుల పని చేశా. అది నా కెరీర్‌లో అత్యంత అద్భుతమైన షూట్. దాదాపు మైనస్ 10 డిగ్రీలు.. అయినా కూడా నాన్-స్టాప్‌గా చిత్రీకరించాం. ఇతర సినిమాలతో పోల్చడానికి నాకు ఒక బెంచ్‌మార్క్‌ను ఏర్పాటు చేసింది.' అని తెలిపింది. అంతేకాకుండా భూషణ్‌కుమార్‌తో విడాకులపై కూడా దివ్య ఖోస్లా స్పందించింది. మీరు విడాకులు తీసుకుంటున్నారా? అని అడగ్గా.. ఆమె క్లారిటీ ఇచ్చింది. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదు.. కానీ మీడియా అది నిజం కావాలని కోరుకుంటుందని షాకింగ్ కామెంట్స్ చేసింది. కాగా.. ఆమె 2005లో టీ-సిరీస్ ఛైర్మన్, ఎండీ భూషణ్ కుమార్‌ను వివాహం చేసుకుంది. ఇక సినిమాల విషయానికొస్తే దివ్య ఖోస్లా చివరిసారిగా నీల్ నితిన్ ముఖేష్‌తో కలిసి నటించిన థ్రిల్లర్-కామెడీ ఏక్ చతుర్ నార్‌లో కనిపించింది.



# కేథరిన్ థ్రెసాతో స్టార్ హీరో వారసుడు స్టెప్పులు

నటుడు విజయ్ వారసుడు జేసన్ సంజయ్ తండ్రి బాటలోనే పయనిస్తారని అందరూ భావించారు. జేసన్ సంజయ్ సౌత్ కాలిఫోర్నియాలో నటన, దర్శకత్వం శాఖల్లో శిక్షణ పొందారు. దీంతో ఈయన నటనపై కాకుండా దర్శకత్వంపై మొగ్గు చూపారు. అలా జేసన్ సంజయ్ మెగాఫోన్ పట్టి తెరకెక్కిస్తున్న తొలి చిత్రం సిగ్మా. ఇందులో నటుడు సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్నారు. ఆయనకు జంటగా ప్రియా అబ్దుల్లా నటిస్తున్నారు. లైకా ప్రొడక్షన్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్ర నిర్మాణ కార్యక్రమాలు చివరి దశకు చేరుకున్నాయి. దీంతో సిగ్మా చిత్రంపై ఆసక్తి నెలకొంటోంది. తమిళం, తెలుగు భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రంలో ఒక ప్రత్యేక పాట చోటు చేసుకుంటుందని, దీన్ని ఇటీవల చిత్రీకరించినట్లు సమాచారం. ఈ పాటలో మెడ్రాస్ చిత్రం ఫేమ్ కేథరిన్ థ్రెసా నటించినట్లు తెలిసింది. అంతే కాకుండా ఆమెతోపాటు దర్శకుడు జేసన్ సంజయ్ కూడా స్టెప్స్ వేసినట్లు ప్రచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అయితే ఆ పాటలో ఈ వర్ధమాన దర్శకుడు ఇలా వచ్చి అలా కనిపించి వెళ్తారా లేక పూర్తిగా ఆ పాటలో కేథరిన్ థ్రెసాతో కలిసి నటించారా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఈ విషయంపై చిత్ర వర్గాల నుంచి క్లారిటీ వచ్చే వరకూ ఈ సస్పెన్స్ కొనసాగుతూనే ఉంటుంది. అదే విధంగా ఈ చిత్రంలో ఒక్క పాటలో మెరిసే జేసన్ సంజయ్ ఆ తరువాత హీరోగా నటించే అవకాశాలు లేకపోలేదన్న ప్రచారం జరుగుతోంది.





# ఆ పని చేశాకే పెళ్లి చేసుకున్నాం!

ఈరోజుల్లో ప్రేమపెళ్లి అనేది కామన్. కానీ భిన్న వర్గాలవారు పెళ్లి చేసుకుంటేనే సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్ చేస్తారు. బాలీవుడ్ హీరోయిన్ సోనాక్షి సిన్హా అలాంటి ట్రోలింగ్ బారిన పడింది. ఈమె జహీర్ ఇక్బాల్‌ను ప్రేమించి పెళ్లాడింది. అయితే అన్ని ప్రేమకథల్లోలాగే తమ లవ్‌స్టోరీలో కూడా చాలా గొడవలు జరిగాయంటోంది. సోనాక్షి మాట్లాడుతూ.. మేము మూడేళ్లపాటు ప్రేమలో ఉన్నాక మామధ్య చాలా గొడవలు జరిగాయి. ఎంతలా అంటే ఒకరి జుట్టు మరొకరు పట్టుకుని పీక్కునేంతలా! అసలు ఒకరి ఆలోచనలను మరొకరం అర్థం చేసుకోలేకపోయాం. అలా అని విడిపోవాలనుకోలేదు. దీన్ని పరిష్కరించుకోవాలనుకున్నాం. కపుల్స్ థెరపీకి వెళ్దామని జహీర్ ఐడియా ఇచ్చాడు. ఈ ఆలోచనేదో బాగుందనిపించింది. రెండు సిట్టింగ్స్‌లోనే మా మధ్య గొడవలు పరిష్కారమయ్యాయి. ఒకరినొకరు బాగా అర్థం చేసుకున్నాం. ప్రతీది నెగెటివ్‌గా చూడకూడదని తెలుసుకున్నాం అని చెప్పుకొచ్చింది. అలా ఏడేళ్లు ప్రేమలో మునిగి తేలిన సోనాక్షి (Sonakshi Sinha), జహీర్ 2024 జూన్ 23న పెళ్లి చేసుకున్నారు. ముంబైలో గ్రాండ్ రిసెప్షన్ కూడా ఏర్పాటు చేశారు. ఇకపోతే వీరిద్దరూ డబుల్ XL (2022) అనే మూవీలో నటించారు. అంతకంటే ముందు వీరు సల్మాన్ ఖాన్ హోస్ట్ చేసిన పార్టీలో కలిశారు. తర్వాత 2017లో ట్యూబ్‌లైట్ ప్రీమియర్‌లో మరోసారి కలుసుకున్నారు. అప్పుడే సరదాగా ఐదుగంటల పాటు మాట్లాడుకున్నారు. అప్పుడే ఈ బంధం ఏదో స్పెషల్‌గా ఉందని సోనాక్షికి అర్థమైంది. తర్వాత అదే నిజమై వైవాహిక బంధంగా మారింది. సోనాక్షి చివరగా జటాధర అనే తెలుగు మూవీలో నటించింది.



# మీనాక్షి చౌదరి పెళ్లి..

టాలీవుడ్ బ్యూటీ మీనాక్షి చౌదరి త్వరలో పెళ్లి చేసుకోబుతున్నట్లు సోషల్‌మీడియాలో వార్తలు వస్తున్నాయి. హీరో సుశాంత్‌తో కొంత కాలంగా ఆమె ప్రేమలో ఉన్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయితే, ఇదే అంశంపై కొద్దిరోజుల క్రితం మీనాక్షి చౌదరి క్లారిటీ ఇచ్చారు. అదంతా ఫేక్.. నేను పెళ్లి చేసుకోవడం లేదని గట్టిగానే చెప్పారు. అయినప్పటికీ సోషల్‌మీడియాలోని కొన్ని మీమ్ పేజీలు మాత్రం వైరల్ చేస్తూనే ఉన్నాయి. రెండురోజులుగా మళ్లీ ఇదే తంతు నెట్టింట కనిపిస్తుంది. వచ్చే ఏడాదిలో మీనాక్షి, సుశాంత్‌ల పెళ్లి అంటూ ఫోటోలు షేర్ చేస్తున్నారు. ఇదే విషయంపై మీనాక్షీ టీమ్ రియాక్ట్ అయింది. కొద్దిరోజుల క్రితం మీనాక్షి చౌదరి, సుశాంత్ ఇద్దరూ ఒక ఎయిర్ పోర్టులో కలిసి కనిపించారు. ఇంకేముంది పెళ్లి వార్తలు లింకు చేశారు. దీంతో మరోసారి ఆమె వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. అయితే ఈసారి ఆమె టీమ్ స్పందించింది. వారిద్దరూ కేవలం స్నేహితులు మాత్రమేనని క్లారిటీ ఇచ్చింది. సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. మీనాక్షికి సంబంధించి ఏదైనా విషయం ఉంటే తాము తప్పకుండా అందరికీ తెలుపుతామన్నారు. ఇకనైన ఈ రూమర్స్ కి ఫుల్‌స్టాప్ పెట్టాలని కోరుతున్నట్లు వారు అభ్యర్థించారు. హీరో సుశాంత్, మీనాక్షి చౌదరి కలిసి ఇచ్చట వాహనములు నిలపరాదు అనే సినిమాలో నటించారు. అలా వారిద్దరి మధ్య మంచి స్నేహం ఉంది.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034